భర్తలెట్లావుండాలి?

అరిగె రామారావు

"అయితే మీ వారికి నీకూ తగువొచ్చిందా?" తన కుర్చీని సునంద దగ్గరకు లాక్కుంటూ కుతూహలంగా అడిగింది సుజాత.

రేడియో బల్లమీద మోచేయి ఆనించి కుడిచెంపక్రింద అరచేయి పెట్టుకుని దిగాలుమంటూ కూర్చున్న సునంద, సుజాత అడిగిన దానికి నీరసంగా 'వూ' అంది. ఎప్పుడూ ట్రిమ్‌గా అలంకరించుకుని నవ్వుతూ తుళ్లుతూవుండే సునంద ఏడ్చి ఏడ్చి వుబ్బిపోయిన కళ్లతో రేగిపోయినజుట్టుతో, మాసిపోయిన చీరతో మూర్తీభవించిన శోకంలాగావుంది.

సునంద భుజంమీద చేయివేసి, "మళ్లీ ఏమొచ్చిందే? అసలు తగవెందుకొచ్చింది?" అని సుజాత అడిగింది.

అలా అడుగుతున్న సుజాత కంఠంలో సానుభూతికంటే సరదాయే ఎక్కువగావుంది.

"ఏముంది? నేను వాలుజడ వేసుకోవటం ఆయనకు గిట్టదు. 'పెళ్లయి నాల్గు సంవత్సరాలవుతున్నా పాతిక సంవత్సరాలు వయి కొస్తున్నా ఇంకా వాలుజడలేమిటి కాలేజి అమ్మాయిలాగా— ముడేసుకోరాదా!' అంటారు. నీవేచెప్పు—పాతిక సంవత్సరాలకే ముసలిదాన్నయిపోయానా, ముడివేసుకోవటానికి. పెళ్లయి నాల్గేళ్లవుతున్నా పిల్లాపీచూ లేరాయె! కాకపోయినా ఆడాళ్ల విషయా లీయన కెందుకుచెప్పు! వాలుజడలే వేసుకుంటామో, రెండుజడలే వేసుకుంటామో ఈయన కెందుకు?" ఎఱ్ఱటి సునంద మొగం కోపంతో మరింత ఎఱ్ఱగా అయింది.

"రెండు రోజుల్నుంచి సాగుతున్న ఈ కోల్ వార్‌కు కారణం ఈ స్వల్ప విషయమేనా?"

"ఆ—దీన్తో ఆగితే ఇంక ననుకునేదేముంది? నన్నన్నవాళ్లు అంతటితో వూరుకోవాలా! మా అమ్మవాళ్లను, అక్కయ్యవాళ్లను కూడ అన్నారు. మా అమ్మ కింత వయసొచ్చినా ఇంకా లోపల లంగా బాడీ వేస్తుందంట. పెద్ద కూతురుకు పెళ్లయి కాపురానికెళ్లినా మా పెద్దక్కయ్య ఇంకా లూజు జడ వేస్తుందంట. ఇలా మా వాళ్లందర్నీ అన్నారే సుజీ!—" పమిట చెంగుతో కళ్లొత్తుకుంటూ ఒక చిన్న రాగానికి శ్రుతి పెట్టింది.

"వాళ్ల వయిపువాళ్లను నీవూ అనక పోయావా? వూరుకున్నావా?"

శ్రుతిలోవున్న రాగం వెంటనే ఆగిపోయింది. సునంద కోపంగా కసిగా అంది. "ఆ—నేనూరుకుంటాననా? వాళ్లవయిపు వాళ్లందర్నీ వరసకట్టుకనని తెగ దులిపేశాను. ఆయనగారి పెద్దక్కగారు ఆర్గురు బిడ్డలతల్లి ఇప్పుడు బ్రాసరీస్ వేస్తుంది. వాళ్ల చిన్నక్క తలచెడి యింటికివచ్చి తల నున్నగా దువ్వి బర్మా ముడివేస్తుంది. సినిమా పాటలు పాడుతుంది. వాళ్లవాళ్లను అనేసరికి అయ్యగారికి పౌరుషం వచ్చింది. అందరు ఆయనలాగా కారేమో పాపం?"

"అది సరేగాని సుందీ! మీ యింట్లో మీ ఇద్దర్నూతప్ప ఇంకెవరూ లేరుకదా. మరి స్నానానికి, భోజనానికి, కాఫీకి వాటికి మాట్లాడుకోవాలంటె మరెట్లాగే?" ఉత్సాహంగా అడిగింది సుజాత.

సుజాతవంక అదోమాదిరిగాచూచి సునంద ఇలా అంది.

"ఏముంది? స్నానానికి నీళ్లుపెట్టాను. అన్నంపెట్టాను—అని ఏ గోడకో, ఏఫోటోకో చెప్పినట్లు చెప్తుతాను. చక్కగా లేచివచ్చి అయ్యగారు అన్ని పనులూ పూర్తి చేసుకుంటారు."

"మరాయన మాటాడవల్సివస్తే—"

"ఇదిగో—" అంటూ నిర్లిప్తంగా రేడియో క్రిందనుండి ఇన్ని చీట్లు తీసి యిచ్చింది.

సుజాత కుర్చీ అంచుకు జరిగి చీట్లన్నీ ఒక్కొక్కదాన్నే ఎంతో ఆసక్తిగా చదివింది.

1. మా పెర్లిన్ స్లాక్ ఎక్కడుంది? కాస్త తెచ్చి యివ్వగలరా?

2. మూడు రోజులక్రితం తమకు బూట్ పాలిష్ చెయ్యమని విన్నవించుకున్నాం. చేశారా ?

3. ఈరాత్రికి భోంచెయ్యను. రాత్రి యింటికి వచ్చేసరికి బహుశా ఆలశం కావచ్చు.

.....ఇవన్నీ సునంద భర్త రాసిన స్లిప్స్.

1. అయితే ఈరాత్రికి పోయి రాజేయ వల్సిన పని లేదుగా?

2. రేపు ఉదయం కాఫీ త్రాగాలనుకుంటె సాయంకాలం వచ్చేటప్పుడు కాఫీ పొడి తీసికురండి'— అదే చీటీలో క్రింద ఇలా రాసివుంది 'మొన్న తెచ్చిన ఐదొందల గ్రాముల కాఫీ పొడి వారానికే అయిపోయిందా?' దీనిక్రింద సునంద మళ్లీ ఇలా రాసింది. 'అవును. మధ్యాహ్నంపూట ఫలహారంగా నేను బొక్కుతున్నాను.'

3. నా పెర్లిన్‌షర్టు ఉతకటానికి ఇక్కడ నౌకర్లెవరూ లేరు. షాపులో వేసుకోండి.

......ఇవన్నీ సునంద రాసిన స్లిప్స్!

ఆ చీట్లన్నింటిని చదివి వరుసగా పెట్టూ, 'వూ—బాగానేవుంది—' అంది సుజాత నవ్వుతూ.

సునంద వేడిగా బరువుగా నిట్టూర్చింది.

సుజాత సునందలు చిననాటి స్నేహితురాళ్ళు. పెళ్లిళ్లయి భర్తలతో కాపురాలు చేస్తున్నారు. అనుకోకుండా గమ్మత్తుగా ఈ వూళ్లో కలిశారు. ఆసందుకి ఈ చివరి యిల్లు సునందది. ఆ చివరి యిల్లు సుజాతది. వాళ్ల భర్తలు కూడా ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. స్నేహితులు కూడాను. అదీ వీళ్ల మూలంగానే జరిగింది. ఇద్దరికీ పిల్లాపాపలేదు. వెనుకా ముందూ పెద్దదిక్కూ కూడలేదు. భర్తలతో వంటరిగా కాపురాలు చేస్తున్నారు.

మధ్యాహ్నంపూట భోజనాలయిన తర్వాత ఎవరో ఒకరింటివద్ద కలిసి కబుర్లాడుకుంటారు ప్రతిరోజూ. సునంద రెండురోజుల్నుంచి రాకపోయేసరికి ఆరోజు మధ్యాహ్నం సుజాతే సునంద యింటికొచ్చింది.

"వస్తాను సుందీ! అప్పుడే నాల్గవ్వచ్చింది. మళ్లీ ఆయనగారికి కాఫీ కాచి, వచ్చేసరికి వేడిగా పెట్టి ఉండాలి—" అని సుజాత బయలుదేరింది.

ఇంటికెళ్లి కాఫీ పెట్టాలని వచ్చిన సుజాత యింటికొచ్చి కాఫీ పెట్టకుండా మంచంమీద పడుకుంది. అటు దొర్లింది. ఇటు దొర్లింది. కళ్లు మూసుకుంది. కళ్లు తెరచింది. బరువుగా వేడిగా నిట్టూర్చింది. "అయ్యో నాకంత భాగ్యంకూడానా?" అని అనుకుని వుసూరుమంది.

కొద్దిసేపు ఆమె ఆలోచనలు తీయగా సాగాయి.

దాంపత్య జీవితంలో మధ్య మధ్యలో ఇలాటి బుల్లి బుల్లి తగాదాలొస్తే ఎంత బాగుంటుంది? గిలి కజ్జాలు పెట్టుకుంటే ఎంత సరదాగా ఉంటుంది? భార్యా భర్తలు ఒకరిమీద ఒకరు యుద్ధం ప్రకటించుకుని మూతులు ముడుచుకుని ముక్కులు విరుచుకుని గోడలతో, గోడనున్న పటాలతో మాట్లాడుతూ స్లిప్స్‌తో సంభాషణలుజరుపుకుంటూ, ఇంట్లో ఒకళ్లకొకళ్లు ఎదురుపడ్డప్పుడు ఎర్రగా చూచుకుంటూ తలలు విదిలించుకుంటూ సూటీ పోటీ మాటలనుకుంటూ వో రెండు మూడు రోజులపాటు ఎడమొగం పెడమొగంగా గడిపి ఆతర్వాత సంధి చేసుకుని కలిసే క్షణాలెంత మధురంగా ఉంటాయి......

ఆమె తీపి ఆలోచనా ప్రవాహంలో వుండి వుండి ఒక చేదుజాలు రేగింది.

తన పెళ్లయి మూడు సంవత్సరాలవుతున్నా ఇంతవరకూ ఏ ఒక్కనాడూ తమిద్దరి మధ్యన ఎలాటి తగాదా రాలేదు. ఇలాంటి మధుర సన్నివేశం ఏ ఒక్కటీ తనీ మూడు సంవత్సరాల దాంపత్య జీవితంలో జరగలేదు. ఆయనొక శాంతమూర్తి! ఎంత కోపం వచ్చినా నవ్వి వూరుకుంటారేగాని ఒక్కసారయినా కసరి ఎరుగరు. భార్యా భర్తల మధ్య వచ్చే తగాదాలు వాళ్లదగ్గరా వీళ్ల దగ్గరా వినటమేగాని తనకేనాడు అనుభవంలోకి రాలేదు...

సుజాత ఆలోచనలో ఇలా తీయతీయగా చేదు చేదుగా సాగుతున్న సమయంలో ఆమె భర్త రామారావు ఆఫీసునుండి యింటికొచ్చాడు. భర్తను చూడగానే సుజాత కొక వింత ఆలోచన వచ్చింది ఆ శాంతమూర్తి అయిన తన భర్త సహనాన్ని పరీక్షించాలనుకుంది.

రామారావు బట్టలు మార్చుకుంటూ, "ఏం సుజీ! పడుకున్నావు? వంట్లో బాగోలేదా?" అని అడిగాడు.

సుజాత మాటాడలేదు.

రామారావు దొడ్లోకెళ్లి స్నానంచేసి వచ్చాడు.

"కాఫీ ఉన్నాయా సుజీ!" అని అడిగాడు.

సుజాత భర్తవంక కొరకొరాచూస్తూ, "కాఫీలేవ్ గీఫీలేవ్! ఒక్కదాన్నే ఈ యింటి చాకిరంతా చేయలేక చస్తున్నాను. మీ అమ్మగార్ని పిలిపించుకోండి. లేకపోతే వో వంట మనిషిని పెట్టుకోండి. అంతేగాని నేను మాత్రం ఈ బండ చాకిరి చేసేదిలేదు—" అంది.

ఎప్పుడూ లేనిది ఈరకంగా మాటాడుతున్న భార్యవంక రామారావు విస్తుబోతూ చూశాడు.

"నీవు రెస్ట్ తీసికో అమ్మలూ! నేను హోటల్లో త్రాగుతాలే!" అని మెల్లగా అన్నాడు.

"అలాగే భోజనం కూడ చేసి రాండి. వంటచేసే వోపిక నాకులేదు—" అనిగట్టిగా అంది.

"అలాగే! పనిమనిషిచేత కారియర్ తెప్పిద్దాం. ఇద్దరూ భోంచేయవచ్చును" అని బట్ట లేసుకుని బయటి కెళ్లాడు.

బయటి కెళ్లుతున్న భర్తనుచూస్తూ అలాగే నిస్తేజంగా పండుకుంది సుజాత.

మర్నాటి సాయంత్రం నాల్గు గంటల ప్రాంతంలో సునంద సుడిగాలిలాగా వచ్చింది. మంచంమీదా బోర్లా పండుకున్న సుజాత వీపుమీద ఒక దెబ్బకొట్టి, "లేలే—ప్రొద్దుగూకొస్తుంటే ఇంకా నిద్రేమిటి!" అని లొడలొడా మాటాడేస్తూ యిల్లంతా బొంగరంలాగా తిర్గింది. ఒక కుర్చీని తీసికెళ్లి దొడ్లో సన్నజాజి పందిరిక్రిందవేసి దానిమీదనెక్కి పూలన్నీ కోసుకుని వడిలో పోసుకుంది.

భర్తలెలా ఉండాలి?

"ఇకవస్తా—" అంటూ హడావుడిగా వెళ్లి పోబోతున్నసునందనతో, "ఏమిటాదూకుడు? కాస్త గుర్రాన్ని కట్టేయ్—" అంది సుజాత.

"టైంలేదు. సినిమా టైం అయిపో తుంది."—వడిలోనిపూలను దోసిట్లోకి తీసి కుని వాసనచూచి మళ్లీ వడిలోకి పోసు కుంటూ అంది.

"యుద్ధ విరమణ జరిగిందా!? సంధి కుదిరిందా?"

"ఆఁ—"అంటూ దీర్ఘం తీసింది సునంద.

"ఎప్పుడు? ఎలా?" ఆదుర్దాగా అడి గింది సుజాత.

"రాత్రి ఆయనేవచ్చి 'సరే నీ ఇష్టం వచ్చి నట్లే జడ వేసుకో'మన్నారు. ఈరోజు ఫస్టు షోకెళ్లుతున్నాం—"అనిచెప్పి సునంద వెళ్లిపోయింది.

సుజాత దిగాలుపడి కూర్చుంది. సునంద ఎంత అదృష్టవంతురాలో అనుకుంది.

ఇంతలో పనిమనిషి రామి విసురుగావచ్చి, "అంట్లేయ్యండి అమ్మగోరు" అంది.

సుజాత లేచి దాని కంట్లు పడేసింది.

"దొంగసచ్చినోడు—ఈడు సచ్చినా నేను ముండమోసేదిలేదు. అమ్మో అమ్మో ఎన్ని దెబ్బలుకొట్టాడు! ఎన్నిదెబ్బలుకొట్టాడు. ఈడి సేయి సెట్టయిపోను. గండు మొగ మోడు. అసలీడు నా కొద్దే అంటే మాఅమ్మ వచ్చింది నన్నేసికట్టి సచ్చింది—" రామి అంట్లు తోముతూ ఇలా కటిక తిట్లు తిట్టుతుంది.

సుజాత దొడ్లోకివచ్చి రోటిమీద కూర్చుంటూ, "ఎవర్నే అలా కటికతిట్లు తిట్టుతున్నావు?" అని అడిగిం .

" [illegible] సచ్చినోడు మా యింటోడమ్మగోరు. చూడండమ్మ గోరు! పళ్లంటా కదుములు కట్టేట్లు ఎట్టా సావబాదిండో—" అంది ముక్కు చీదేసుకుంటూ.

"ఎందుకు కొట్టాడే? నీవేమంటే కొట్టాడే"

"ఉత్తపున్నేనికే కొట్టాడమ్మగోరు. రేతిరి వెంటపూసుకొచ్చాడు. ఏడకెళ్లావ్? దేనికాడ కెళ్లావ్ అని అడిగా. అంతే—పట్టుకుని తెగ ఉతికాడు—" అంది రామి.

"రీ నీ దుంపతెగ. వాడికి ఎవతైనా ఉందా ఏమే?" అంది నవ్వుతూ సుజాత.

"ఎవతీ లేదమ్మగోరు! మళ్లీ దేనొంకా కన్నెత్తి చూడడు. నేనంటె పడిసస్తాడు!" ఆమాట అంటుంటే దాని కళ్లల్లో ఏదో వెలుగు తళుకుమంది.

"మరి నీ వా మాట ఎందుకన్నావే?"

"సరదా కన్నానమ్మగోరు. వూరికే వుడికి త్తానికి—" ముసి ముసిగా నవ్వుతూ అంది.

"అయితే వాడూ సరదాకి కొట్టేఉంటాడు. ఇద్దరి సరదా తీరిందిగా—" అంటూ సుజాత లోపలి కెళ్లిపోయింది.

"అదు సావకొట్టినా సరదాగానే ఉంటుంది" రామి మెల్లగా తనలో తాను అనుకోవటం సుజాత వంటింట్లో కాఫీ కలుపుతూ విన్నది.

పనంతా అవజేసి సుజాత పెట్టిన అన్నం గిన్నెను పమిట చెంగుకింద పెట్టుకుంటూ "విూరదుర్ట్టవంతులమ్మగోరు! సిన్నబాబు గోరు మిమ్మలెప్పుడూ పన్నెత్తు మాట కూడ అనరు"—అంది.

"అయ్యో నా అదృష్టమే చెప్పు—" అని తనలో తా ననుకుని గట్టిగా నిట్టూర్చింది సుజాత.

స్నానమదీచేసి అద్దంముందు కూర్చుని జడేసుకోబోతున్న సుజాత మనస్సులో ఒక ఆలోచన సన్నగా మెదిలింది. ఎలాగయినాసరే తన భర్తకి కోపం తెప్పించి పోట్లాట పెట్టు కుని రెండు మూడు రోజులుపాటు మాటలు లేకుండా ఉండాలి. అవసరమయితే తన్నులుతిన్నా ఫర్వాలేదు. ఎలాగైనా ఈరోజు ఆయనకు కోపం తెప్పించాలి. ఎలా? సుజాత కొక ఆలోచన తట్టింది. గబ గబా లేచి పక్కింటి పిన్నిగారింటి కెళ్లి "ఈరోజు ముడి చుట్టుకోవాలనివుంది. కాస్త మీ సవరం పిన్నలూ ఇవ్వండి పిన్నిగారూ!" అని అడిగింది.

ఆమె ఆశ్చర్యపోయి నవ్వి, "నీ జడ పెద్ద జడే కదమ్మాయి! మళ్లీ ఇంకా సవరం దేనికి?" అని అడిగింది.

"చాల పెద్ద ముడి వేసుకోవాలని—" నవ్వుతూ అని వచ్చింది.

సవరంపెట్టి పిన్నులుగుచ్చి పెద్ద ముడి వేసుకుంది. దానినిండా పూలు పెట్టింది. రూపాయంతబొట్టు పెట్టు కుంది. అద్దంలో చూచుకుంటూ ఇలా అనుకుంది—

'ఇప్పు డాయన వస్తారు. ఆయనకు తనె ప్పుడూ, లూజుగా జడ వేసుకోవటమే ఇష్టం. ఈ ముడీ, ఈ బొట్టుచూచి 'ఏమిటే అన తారం? నోట్లో ఒక చుట్ట పెట్టుకుంటె సరి. ఇక అచ్చం అప్పలమ్మలాగా ఉంటావ్' అని అంటారు.

'నన్ను అప్పలమ్మా, గిప్పలమ్మా అంటే వూరుకునేదిలేదు—' అని తను కోపంగా



అడిగారండి.

"పూరుకోక ఏం జేస్తావ్?" అని అడుగుతారు.

"నన్ను అప్పలమ్మా అంటే నిన్నుకూడ అప్పలయ్యా!" అంటాను.

"అంటావ్—అంటావ్—అంటే నీ వీపు విమానంమోత మోగుతుంది—" అంటారు.

"ఏం ఎందుకు మోగుతుందేం?" తను

భర్తలెలా ఉండాలి?

రెట్టించి అడుగుతుంది.

ఇలా మాటమీద మాట పెరిగి తగు వస్తుంది. అప్పు డిద్దరికీ మాటలుండవు. అప్పుడు ఇద్దరిమధ్యన యుద్ధం......

ఇలా సుజాత తన ఊహాలోకంలో ఒక మధుర సన్నివేశాన్నిసృష్టించుకుంటున్న సమ

శక్తివంతమైన ఫ్రెంచి ఔషధం తిరిగి లభ్యమౌతున్నది!



రక్తాన్ని శుద్ధిచేసి, బాధ కలిగించే వాటినుంచి కాపాడుతుంది. కాళ్ల పగుళ్లు, ఇంకా అనేక రకాలైన చర్మవ్యాధులు ఎగ్జిమా, మొటిమలు, చెమటకాయలు, పెచ్చు లేవడం, పుండ్లు మున్నగునవి చాలావరకు రక్తంలోని దోషంవల్లనే సంభవిస్తవి.

ఇలాంటి వ్యాధులు ఏదో పైపూతలు పూసినంత మాత్రాన తగ్గిపోగలవనుకుంటే చాలా సందర్భాలలో అలా జరగదు. ఒకవేళ పూతలకు తగ్గినట్టు తగ్గినా, వెంటనే మళ్లీ అవి వస్తూ వుంటవి. అందువల్లనే కొంతమంది ఏటేటా ఎగ్జిమా, చెమటకాయలు, మొటిమలు, కాళ్లపగుళ్లు, పుండ్లు మున్నగువాటితో బాధపడుతూ వుంటారు. ఇలాంటి వ్యాధులన్నింటికీ అసలు కారణం రక్తదోషమే.

రిచెలెన్ బ్లడ్ ప్యూరిఫైయర్ సేవిస్తే అది ఎంత చక్కగా పనిచేయగలదో మీకే ఆశ్చర్యం కలిగిస్తుంది. శరీరం అడుగున వుండే గ్రంథు లన్నింటినీ పరిశుభ్రం చేయడమేగాక, మీ రక్తం అత్యంత పరిశుభ్రమౌతుంది. శరీరంపైనవుండే మచ్చలు, ఇతరత్రమైనవన్నీ కూడా అదృశ్యమైపోయి మీ శరీరం తిరిగి ఆరోగ్యప్రదమైన కాంతులీనుతూ వుంటుంది.

రిచెలెన్ లాక్సటివ్‌ను, గల్లాప్ ఆయింట్‌మెంటునుకూడా వాడండి. కెమిస్టులందరివద్ద, స్టోర్లలోను కలవు. వివరాలు తెలిపే కరపత్రాన్ని అడిగి తీసికోండి.

రిచెలెన్

బ్లడ్ ప్యూరిఫైయర్

ఇండియా అంతటా ఏజెంట్లు కావాలి. ఈ విలాసానికి వ్రాయండి.

ఇండియాలో సోల్ డిస్ట్రిబ్యూటర్స్

మహేశ్వరీ జనరల్ స్టోర్స్,

19/35, పెద్దబజారు, కోయంబత్తూరు-1.

EP.MG-1

యానికి రామారావు ఆఫీసునుండి వచ్చాడు. వచ్చి సుజాత వంక వింతగా చూశాడు. బట్టలు మార్చుకుని లుంగీ కట్టుకుని ఆమె దగ్గర కొచ్చాడు. అతను కోపంలో అన బోయే మాటలను వినటానికి చెవులు రిక్కించుకునివుంది సుజాత.

సుజాత వెనక్కివచ్చి ఆమె రెండుభుజాలు పట్టుకుని, "చాలా బాగున్నావు అమ్మలూ! నీకు జడకంటె ఇదే బాగుంది. రోజూ ఇలా ముడేసుకోరాదూ?" అంటూ ఆమె మెడ మీద పెదాలు ఆనించాడు.

వంకీకివున్న టవల్ భుజాన వేసుకు "నిజంగా చాలాం బాగున్నావు అమ్మలూ", మళ్లీ ఒకసారి అని దొడ్లో కెళ్లాడు.

"కర్మ—" అని సుజాత నుదురు కొట్టుకుంది.

మర్నాడు భర్త టెర్లిన్‌షర్టు కొకదాని పని పట్టించాలని పని కట్టుకుంది సుజాత. ఆ షర్టును రామారావు ఏభై రూపాయలు పెట్టికొన్నాడు. అతనికున్న ఒకే ఒక టెరి న్ షర్టు అది. దాన్ని లాండ్రీకేస్తే వాళ్ళు పాడు చేస్తారని ఎప్పుడూ దాన్ని లాండ్రీ కేయడు. సుజాత చేతనే వాష్ చేయిస్తాడు. ఆ షర్టును వుతకమని సుజాతకు ఆరోజు ఉదయమే చెప్పాడు. అతడంత ప్రత్యేకంగా చూచుకుంటున్న ఆ షర్టును ఎలాగయినా పాడుచేసి అతనికి కోపం తెప్పించాలని నిర్ణయించుకుంది సుజాత. తన చీరల్లో రంగు పోయే చీర నొకదాన్ని తీసుకుని ఆ చీరనూ టెర్లిన్‌షర్టును కలిపి సర్ఫ్‌లో పెట్టింది. ఒక అరగంటలో ఆ చీర రంగంతా టెర్లిన్ షర్టుకు చక్కగా పట్టింది. అది చూడగానే సుజాతకు నవ్వు వచ్చింది, ప్రాణం ఉసూరుమంది. ఏభైరూపాయల షర్టు. తనకున్న అవసరానికొద్దీ దాన్ని పాడుజేయక తప్పదు మరి.

సాయంత్రం ఆఫీసునుండి వచ్చిన రామారావు తనెంతో ఇదిగా చూచుకుంటున్న షర్టుకు పట్టిన గతిని చూడగానే ఉసూరుమన్నాడు.

"ఇదేమిటి అమ్మలూ! ఇలా తయారు జేశావ్!" అన్నాడు. "నాచీరతోపాటు పెట్టాను. నా చీరరంగు దీని కంటుకున్నది" అంది.

"రంగుపోయే చీరతో వెళ్తే ఎలాగ అమ్మలూ?" అన్నాడు.

ఫర్వాలేదు. దారికొస్తున్నాడని సంబర పడింది సుజాత.

"అది రంగుపోయే చీరని నాకేం తెల్సు? నేనేం కలగన్నానా?" అని విసురుగా సమాధానం చెప్పింది.

రామారావు ఒకసారి సుజాత మొగంలోకి చూశాడు. మళ్లీ ఏమనుకున్నాడో ఏమో, "పోన్లే సుజీ!" అని లోపలికెళ్లి పోయాడు.

మళ్లీ దెబ్బతిన్న సుజాత నీళ్లు కారి పోయింది—రంగు రంగుల టెర్లిన్‌షర్టు తనని చూచి ఎక్కిరించినట్లనిపించింది.

అయినా సుజాత అధైర్యపడలేదు. ఆమె పట్టుదల ఇంకా పెరిగింది. మర్నాడుదయం మరో సంఘటన్ని కల్పించింది.

ఎవరైనా 'ఫ్రెండ్సు'వాళ్లు వచ్చినపుడు వాడవచ్చునని రామారావు అమధ్య హైదరాబాద్ వెళ్లినప్పుడు ఒక ఖరీదైన టీసెట్ తీసికొచ్చాడు. రోజు వారీగా వాట్ని వాడనీయడు. అలమరలో పెట్టి ఉంచుతాడు.

వాట్ని కడగాలని బయటికి తీసి రెండు కప్పులను, ఒక సాసర్ని చేయి జారినట్లు కావాలని చేయి జార్చింది.

అయినా రామారావేం అనలేదు—"చేయి జారిందా? పోన్లే—" అన్నాడు.

ఇక సుజాత ధైర్యం సన్నగిల్లటం మొదలుపెట్టింది. అసలీ మనిషికి ఈజన్మలో కోపమనేది వస్తుందా అని అనుకుంది.

ఆ సాయంత్రం పనిమనిషి రామి క్రొత్త సిల్కుచీర కట్టుకుని ముసి ముసి నవ్వులతో పని చేయటానికొచ్చింది.

"ఏమిటి విశేషం? క్రొత్తచీరకట్టావ్?" అని అడిగింది సుజాత.

"మొన్న కొట్టినదానికి జాల్మైనా. మా మావ కొని తెచ్చాడమ్మగోరు—" అంది ఎంతో గర్వంగా.

సుజాత మొగమొందుకో చిన్నబోయింది. ఏదో తెలియని దిగులు గుండెలచుట్టూ పేరుకుంది. తనకంటె ఆఖరికి పని మనిషి రామి కూడా ఎంతో అదృష్టవంతురాలను కుంది. ఇలా అనుకోగానే ఒక విషాదరేఖ ఆమె గుండెల్లో రేవి పేరుకులేచింది. ఇక తని జన్మలో ఆయనకు కోపాన్ని తెప్పించలేదు. ఆయనకు కోపమూరాదు. తన ముచ్చటా తీరదు. పోనీ తనంత తాను కోపం జేసుకుందామంటె, అదీ కుదిరేటట్లులేదు. రెండుచేతులూ కలిస్తేగదా చప్పట్లు! ఇద్దరిలో కోపం రేగినప్పుడేకదా సరదా! ఎంత సేపని తనొకర్తే కోపం తెప్పించుకుని మూతి ముడ్చుకుని కూర్చుంటుంది. ఆయన ముద్దుగా 'అమ్మలూ!' అంటే చాలు ఆ నటిస్తున్న కోపం కాస్త ఎగిరి చక్కా పోతుంది. ఛా ఏమిటో, తన ముచ్చట ఈ జన్మలో తీరేటట్లులేదు. అని నిర్ధారణ చేసుకునేసరికి సుజాతకి అంతులేని దిగులు పట్టుకుంది.

రోజులు గడుస్తున్నకొద్దీ సుజాతకు నిరాశ, నిస్పృహ ఎక్కువయిపోతున్నాయి. ఏదో దిగులు, విరక్తి ఆమెను క్రుంగదీస్తున్నాయి. రోజు రోజుకీ ఆమె నీరసించి పోతుంది......ఎప్పుడూ ఎడతెగని ఆలోచనలు—అసలు తన భర్త తన నొక వ్యక్తిగా, అర్ధాంగిగా చూడటంలేదు. ప్రతి దానికీ 'అమ్మలూ—అమ్మలూ' అనిపిలుస్తూ ఒక బుల్లి పాపాయిని చూచినట్లు చూస్తున్నాడు. ఏ పని చేసినా కాస్తయినా కసురుకోడు, తిట్టడు. ఏదేదో చిన్న పిల్ల అని సరిపెట్టుకున్నట్లుగా ఉంటుంది ఆయన ప్రవర్తన. ఎంత చిన్న పిల్లలయినా కోపం తెప్పించే పనిచేస్తే విసుక్కుంటాం కదా. ఒక్కొక్కసారి చేయి కూడ చేసుకుంటాంకదా. అదీ లేదు.....అస్సలీయన తనని ప్రేమిస్తున్నాడా అని అనుమానం కూడ కలుగుతుంది. నిజంగా ప్రేమించే వాడయితే కాస్త సరదాగా కోపగించుకోవటం' గిల్లికజ్జాలు పెట్టుకోవటం, అప్పుడప్పుడు చేయి చేసుకోవటం—ఇవన్నీ చేయడేం! ఇలా శాంతంగా వుండటం, ఎలాటి విషయానికయినా చలించకుండా ఉండటం, ఏమి చేసినా ఏమీ అనకపోవటం ఇదంతా తనమీద ప్రేమవుండికాదు— తనని పరాయి దాన్నిగా చూడటం. తనని కేర్‌మని ఇలా ఏడిపించటం దేనికి? తన కిష్టమయిన వాళ్లనే చేసుకుని ఉండవచ్చునుగా.

....ఇలాటి ఆలోచనలో సుజాత మధ్యన తన భర్తకు తనూ మధ్యన లేని దూరాన్ని వూహించుకుంటూ అత న్నొక పరాయి మనిషిగా చూడటం మొదలు పెట్టింది.

రామారావు, ఇటీవల సుజాతలో కని పిస్తున్న మార్పును గ్రహిస్తూనే ఉన్నాడు. కాని, ఈ అకారణమైన మార్పుకు అతనికి మాత్రం కారణం బోధపడటంలేదు.

రోజు రోజుకీ చిక్కిపోతున్న భార్యను చూచి, "ఏం అమ్మలూ, అలా ఉంటు న్నావ్? ఒంట్లో బాగుండటంలేదా? పోనీ డాక్టరుకు చూపించకూడదు—" అన్నాడు.

"ఏం నాకేదయినా పెద్దరోగం వచ్చి చస్తే ఇంకోదాన్ని కట్టుకుందామను కుంటున్నారా?" అని కస్సున లేచింది సుజాత.

పాపం, రామారావు ఆ మాటకెంతో బాధపడిపోయాడు.

మర్నాడు. మెల్లగా ఇలా అన్నాడు "పోనీ, నాల్గురోజులపాటు మీ వాళ్లదగ్గర ఉండి రాకూడదు."

రామారావు అంటున్న మాట పూర్తి కాకుండానే, "నేను ఉండటం మీకంత కష్టమయితే అనూటే తెగేసిచెప్పండి. నాల్గురోజులపాటేం కర్మ శాశ్వతంగానే వెళ్లిపోతాను. ఈ పాడు పీడా మీకు విర గడైపోతుంది—" అంటూ లేచింది.

రామారావు మారు మాటాడకుండా బయటి కెళ్లిపోయాడు.

సుజాత ఎందువల్ల ఇలా మారిపోయిందో ఎంత ఆలోచించినా రామారావు కర్థంకాలేదు. ఆమెకు తనేలాటిలోపమూ చేయలేదు. ఏ విషయములోనూ ఏమీ అనలేదు. మరెందుకని తనంటె ఇంత మండిపోతుంది? ఎందుకని తనకు దూరమవుతూ తన నొక పరాయి వ్యక్తిగా చూస్తూంది......ఇవి అతడ్ని వేధిస్తోన్న ప్రశ్నలు.

ఒకరోజు సాయంత్రం పార్కులో తన వేదన్ని సునంద భర్తయిన రాజారావు ముందు వెళ్లబోసుకున్నాడు.

"మనం ప్రతి విషయానికి మరీ అంత

కొత్త మొత్తగా ఉండకూడదోయ్. వెనుకా ముందు చూడకుండా వాళ్ళు తగుల్నిస్తే చాలు [illegible] అనంటటవే చక్కపడుతాయి. మన పద్ధతి అంతేనోయ్!—" అని నవ్వుతూ చెప్పాడు.

భర్తలెలా వుండాలి?

“ఏం తప్పులేనిదే ఉత్త పుణ్యానికి తప్పమంటావా?” రామారావు అమాయకంగా అడిగాడు.

“నీవు ఏమీ అనకుండానే ఉత్త పుణ్యానికే ఆమె నిన్ను అన్ని మాటలనలేదా?” రామారావుకూ అంతే అనిపించింది. రాజారావు చెప్పుతున్నదే కరక్టేమో అనిపించింది. ఒక వరుస తగలించి చూద్దాం

వీరు ఉతికే బట్టలన్నీ మెరయుచుండే తెలుపు! విస్మయకరమైన శుభ్రత! ఇది యెల్ల ముద్దల కొలది మరగ గల సర్ఫ్ యొక్క ఉతికే అధిక శక్తి వల్లనే. మీ బట్టలన్నిటి ఉతుకుట చాలా సులభం చేస్తుంది. మీ పిల్లల బట్టలు, షర్టులు, చీరలు... ప్రతిదీ అమిత తెల్లగాను, ప్రతిదీ పరిశుభ్రంగాను వుంటుంది. సర్ఫ్‌తో ఇంట్లో ఉతుక్కోండి.

సర్ఫ్ అమిత తెల్లగా ఉతుకును

లింటాస్.SU. 19-140 TL

హిందుస్తాన్ లివర్ ఉత్పత్తి

అనుకున్నాడు.

* * *

పగలు పన్నెండు గంటలవుతుంది సునంద అప్పుడే భోంచేసి ఏదో పుస్తకం తిరగవేస్తూ కూర్చుంది. వాకిట్లో మనిషి వచ్చిన అలికిడి ఆయేసరికి తలఎత్తి చూచింది చూచి ఆశ్చర్యంతో మునిగిపోయింది.

ఏడ్చి ఏడ్చి లావుగా వుబ్బిన కండ్లతోనూ, రేగిన జుట్టుతో, మాసిపోయిన చీరతో, చేతిలో ఒక చిన్న సంచితో, మ్లాన వదనంతో వచ్చింది సుజాతేనా?

సునంద లేచి రెండడుగులు ముందుకేసి, 'ఎవరు సుజీ!' అంది.

సుజాత రివ్వునవచ్చి సునందను కౌగలించుకుని భోరు భోరున ఏడ్చింది. సునంద కంగారు పడిపోయింది.

'ఏవిటే? ఎందుకిలా ఏడుస్తున్నావ్? అసలేం జరిగింది?' అని అడిగింది.

ఎక్కిళ్ళుపడుతూ సుజాత తన కుడి చెంపను చూపించింది. ఎర్రటి చెంపమీద చేతి అయిదు వేళ్ళ గుర్తులు పడ్డాయి. ఎర్రగా కమిలిపోయి, అరచేతి మందాన పొంగి వుంది.

"ఎవరే ఇది? ఎవరు కొట్టారే?" విస్తుబోతూ అడిగింది సునంద.

"ఇంకెవరు? ఆయనే—" అంది రోస్తూ కసిగా.......

"ఎవరు మీ ఆయనా?—మీ ఆయన కొట్టాడా?"

"వూ—" అంటూ అక్కడున్న ఒక కుర్చీమీద కూలబడింది.

"మీ ఆయన నిన్ను కొట టమేమిటే? ఇదేం నమ్మే విషయములాగా లేదు. అసలాయనకు ఇంత కోపం వస్తుందా?" మరో కుర్చీలో కూర్చుంటూ సునంద అడిగింది.

"ఆయనగారే కొట్టారు. మరేం పోయే కాలమొచ్చిందో?"

"అసలేం జరిగిందేమిటి?" ఉత్సాహంగా అడిగింది సునంద.

సుజాత మళ్లీ ఒక ఏడ్పు రాగానికి శ్రుతి పెట్టింది. సన్న సన్నగా ఏడుస్తూ ముక్కు చీదేస్తూ, పమిటి చెంగుతో కళ్ళొత్తుకుంటూ మెటికలు విరుస్తూ సుజాత చెప్పిన విషయానికి సారాంశమిది.

ఈరోజు ఉదయం రామారావు పేపరు కొరకు బజారెళ్లి తిరిగి వచ్చేసరికి సుజాత ప్రక్కింటివాళ్ల చిన్న పాపాయిని ఎత్తుకుని ముద్దాడుతూ కూర్చుంది. "పావు గంటలోనే అమ్మవయిపోయావేంటి?" అని రామారావు నవ్వుతూ ఉషారుగాఅన్నాడు. ఆ మాటకు సుజాత భర్త వంక రుసరుసలాడుతూ చూచి, "ఆ మన మొగాల కదే తక్కువ—" అంది రామారావు దానికి, "ఏం, అదేమంత గొప్ప విషయం. నీవు అమ్మవు కాలేవా?" అన్నాడు. ఆ మాటకు సుజాత మెడ ఒక విసురు విసిరి చేతులు తిప్పుతూ, "ఆ—ఈ మూడు సంవత్సరాల నుండి అయ్యావు. ఇకవుతావు—అంది" అంతటితో రామారావు ఉత్త పుణ్యానికి మీద కొచ్చి చెంప ఫెడేల్‌మనిపించాడు. (ఈమాట నమ్మటానికి వీలులేదు. సుజాత ఇంకా ఏదో అని ఉంటుంది) జుట్టు పట్టుకుని వంగపెట్టి వీపుమీద గుభీగుభీమని గుద్దులు గుద్దేడు.

సుజాత ఏడుస్తూ, వీపు అరచేత్తో సవర దీసుకుంటూ, అంది "వీపు విరిగి పోయేటట్లు చావబాదాడు.....నే నింత వరకు ఎవరి చేతిలోనూ ఒక చిన్నదెబ్బయినా తిని ఎరుగను. పద్దెనిమిదేళ్ళు మాయింట్లో పెరిగానంటే, మా అమ్మగాని నాన్నగాని, అక్కయ్యలుగాని ఒక్క దెబ్బ కొట్టి ఎరుగుదురా? ఈనాటికి ఈయన చేతుల్లో చావు దెబ్బలు తినవల్సివచ్చింది."

సుజాత ఈ మాట అంటుంటే, 'మీ అమ్మ గరిటకాల్చి వాతలుపెట్టిన సంగతి నాకు తెలియదనా' అని లోపల అనుకుంది సునంద. పయికిమాత్రం ఇలా అన్నది "నాకు తెలియదూ, మీవాళ్ళు నిన్నెంత గారాబంగా పెంచింది."

"అవునే? ఎలా పెరిగానో ఏంజేశానో చూడవే.ఈవేళ ఈనాటి గతి పట్టింది. ఈ రాక సుడితో నేనిక సంసారం చేయలేను తల్లీ! అందుకే మా అమ్మవాళ్లింటికి పోతున్నా. వాళ్లకు నేనేం బరువా? పువ్వుల్లో పెట్టుకుని చూస్తారు" అంది సుజాత.

"ఏమిటీ, ఇప్పుడు మీ వాళ్లింటికే బయలుదేరావా! ఈ సంచి అదేనా?" ఆశ్చర్యంగా అడిగింది సునంద.

"ఆ—ఈ నరకంలో ఇంకో క్షణమయినా ఉంటానా?" కసిగా అంది సుజాత.

కాసేపు సునంద మవునంగా వుంది. తర్వాత మెల్లగా ఇలా అంది "కాదు సుజీ, నే ననేది—నీవు తొందర పడుతున్నావేమో నని. సంసారంలో ఇలాటివి రావటం చాల సహజం. అసలు ఇలాటి తగాదాలొస్తేనే అందంగా ఉంటుందేమో. ఎప్పుడూ ఒకే మాదిరిగా రొటీన్‌గా ఏమీ పసలేకుండా ఎన్నాళ్లు చేస్తాం ఈ కాపురాలు! ఇలాటి అందమైన తుఫానులు అప్పుడప్పుడువస్తూ వుంటేనే సరదాగా ఉంటుంది."

(ఈ మాటలన్నీఒకసారి సుజాత అన్నవే!)

"ఈ సరదా చట్టుబండలుగానూ? ఏం సరదామ్మ. పాడు సరదా. మొగుడుచేతిలో చావు దెబ్బలు తినటంకూడ ఒక సరదాయేనా?" సుజాత చేతులు త్రిప్పుతూ అంది. ●